సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 9 । ఫిబ్రవరి । 2024



సమష్టిగా 'నులి'మేద్దాం

జిల్లావ్యాప్తంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేయనున్నారు.

8లో ▸



నేడు మావుళ్లమ్మ ప్రసాద వితరణ

భీమవరం మావుళ్లమ్మ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఆలయం వద్ద అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నారు.

8లో ▸



బంగారం మాయంపై విచారణ

దువ్వ సొసైటీలోని లాకర్‌లో భద్రపరచిన బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై అధికారులు విచారణ చేపట్టారు.

8లో ▸

న్యూస్‌రీల్

వీఆర్వోలకు పదోన్నతులు



కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పనిచేస్తున్న 21 మంది వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పిస్తూ కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఉత్తర్వులు అందజేశారు. అలాగే ఇటీవల ఆకివీడు మండలంలో గుండెపోటుతో మృతి చెందిన ఉద్యోగి కుమారుడు కడిమి కిరణ్‌కు కారుణ్య నియామకం కింద కలెక్టరేట్‌లో అటెండర్‌గా నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ, ఏలూరు జిల్లా అధ్యక్షుడు శ్రీరామచంద్రమూర్తి రాంబాబు పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ వీఆర్వోలకు సీనియర్ సహాయకులుగా పదోన్నతులు కల్పించినందుకు కలెక్టర్‌కు, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డీఆర్‌ఓ పుష్పమణికి, కలెక్టరేట్ ఏఓ కాశీ విశ్వేశ్వరరావుకు గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

నేడు మెగా ఆక్వా మేళా

నరసాపురం: పట్టణంలోని గోదావరి పంటు రేవు వద్ద ఉన్న అల్లూరి కల్యాణ మండపంలో శుక్రవారం నరసాపురం ఫిషరీష్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో మెగా ఆక్వా మేళా నిర్వహించనున్నారు. రొయ్యలు, చేపల రైతులకు సాగులో మెలకువలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటలకు జరిగే సదస్సులో రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సిదిరి అప్పలరాజు, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. సాయంత్రం 5 గంటలు వరకు సదస్సు జరుగుతుంది.

15లోపు ధాన్యం విక్రయించాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించి 90 రోజులు గడిచిందని, ఈనెల 15లోపు రైతుల వద్ద మిగిలిన ధాన్యాన్ని కూడా విక్రయించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. ఎక్కడైనా రైతులు అపరాలు సాగు చేస్తున్న కారణంగా వరి నూర్పిళ్లు ఆలస్యమైతే, అలా మిగిలిన ధాన్యాన్ని రబీ సీజన్‌లో లేట్ ఖరీఫ్ కింద కొనుగోలుకు ప్రతిపాదిస్తామన్నారు. ఆలస్యంగా నూర్పిళ్లు చేసిన రైతులు ఆందోళన చెందవద్దని సూచించారు. ఏలూరు జిల్లాలో గత నవంబర్ 10 నుంచి ఈ నెల 7 వరకు 41,570 మంది రైతుల నుంచి రూ.712.17 కోట్ల విలువైన 3,26,005 టన్నుల ధాన్యాన్ని సేకరించామన్నారు. రూ.657.85 కోట్లను రైతుల ఖాతాలకు జమ చేశామని, మిగిలిన రూ.53.59 కోట్లు బ్యాంక్ వద్ద జమ చేసే ప్రక్రియలో ఉన్నాయన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 1,515 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రాక్టికల్స్‌కు గురువారం 1,515 మంది హాజరయ్యారు. జిల్లాలోని 12 కేంద్రాల్లో ఉదయం పరీక్షకు 876 మందికి 846 మంది, మధ్యాహ్నం పరీక్షకు 682 మందికిగాను 669 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు.

రామవరప్పాడులో తాత్కాలిక రైల్వే స్టాప్

ఏలూరు (టూటౌన్): గుణదల మేరీమాత ఉత్సవాలను పురస్కరించుకుని ఈనెల 9 నుంచి 11 వరకు రామవరప్పాడు వద్ద పలు రైళ్లకు తాత్కాలిక స్టాప్ ఇవ్వనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ పీఆర్వో నుస్రత్ ఎం. మండ్రుపకర్ గురువారం ప్రకటనలో తెలిపారు. పూరీ-తిరుపతి, బిలాస్‌పూర్-తిరుపతి, తిరుపతి-పూరీ, తిరుపతి-బిలాస్‌పూర్ రైళ్లకు ప్రజల కోరిక మేరకు తాత్కాలిక స్టాప్ కల్పించనున్నామన్నారు.

హెచ్‌ఎం టెస్టుకు ఫీజులు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హెడ్‌మాస్టర్ అకౌంట్ టెస్ట్-2024 పేపర్-1,-2 పరీక్షలకు ఫీజులు చెల్లించడానికి షెడ్యూల్ విడుదలైందని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు. ఒక పేపర్‌కు రూ.100, రెండు పేపర్లకు రూ.150 ఫీజును ఈనెల 17 వరకు అపరాధ రుసుం లేకుండా, రూ.60 అపరాధ రుసుంతో ఈనెల 22 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడానికి గురువారం నుంచి బీఎస్‌ఈ ఏపీ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఫీజును పేమెంట్ గేట్‌వే ద్వారా ఆన్‌లైన్‌లోనే మాత్రమే చేయాలని, ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తులను, ఇతర డాక్యుమెంట్లను డీఈఓ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఇళ్ల లబ్ధిదారులు లక్షాధికారులు



స్వగృహమస్తు.. ఇరగవరం మండలం కావలిపురం జగనన్న లేవుట్‌లో ఇళ్లు

పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గృహ యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాల భూములను సేకరించి లక్షలాది మందికి పంపిణీ చేశారు. ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయంతో పాటు జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. దీంతో కాలనీలు కొత్త ఊళ్లను తలపిస్తున్నాయి. లక్షల విలువైన ఆస్తిగా కాలనీల్లో ఇళ్లు నిలుస్తున్నాయి. ఇలా గృహ లబ్ధిదారులను ప్రభుత్వం లక్షాధికారులను చేస్తోంది.

లక్షణంగా నిర్మాణాలు

- పేదల సొంతింటి కల సాకారం
- లక్షల విలువ చేసే ఆస్తిగా ఇల్లు
- జిల్లాలో గృహ నిర్మాణాలకు రూ.1,000 కోట్లకు పైగా వెచ్చించిన ప్రభుత్వం
- మొత్తంగా 71,283 ఇళ్ల మంజూరు
- ఊళ్లను తలపిస్తున్న జగనన్న కాలనీలు

పశ్చిమగోదావరిలో ఇళ్ల నిర్మాణం	
సేకరించిన భూమి (ఎకరాలు)	892.50
లేఅవుట్లు	630
లేఅవుట్లలో మంజూరైన ఇళ్లు	49,802
సొంత స్థలంలో మంజూరైనవి	21,481
మొత్తం మంజూరైన ఇళ్లు	71,283
పూర్తయిన ఇళ్లు	26,985
వివిధ దశల్లో నిర్మాణాలు	44,298

భీమవరం(ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లాలోని 630 జగనన్న లేఅవుట్లలో 49,802 మంది పేదలకు ప్రభుత్వం ఇంటి స్థలాలు మంజూరు చేసి నిర్మాణాలకు ప్రోత్సహిస్తోంది. మొత్తంగా 892.50 ఎకరాలను సేకరించి కాలనీలుగా మార్చింది. భూ సేకరణ, నిర్మాణం, మౌలిక వసతులైన రోడ్లు, విద్యుత్, తాగునీటి సరఫరాకు రూ.1,000 కోట్లకు పైగా వెచ్చించింది. ఆయా ప్రాంతాల్లో సెంటు స్థలం విలువ రూ.4 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సెంటున్నర, పట్టణ ప్రాంతాల్లో సెంటు చొప్పున పేదలకు ప్రభుత్వం స్థలాలు మంజూరు చేసింది. స్థలాల విలువ గ్రామీణ ప్రాంతాల్లో రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉండగా భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురం, పాలకొల్లు పట్టణాల్లో రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు ఉంది. దీంతో పాటు ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందించింది. మొత్తంగా నిర్మాణం పూర్తిచేసుకున్న ఇంటి విలువ రూ.15 లక్షలకు పైగా ఉంది.



భీమవరం విస్సాకోడేరు లేవుట్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్

ప్రభుత్వం వెచ్చించిన మొత్తం
భూ సేకరణకు.. రూ. 433.33 కోట్లు
ఇళ్ల నిర్మాణాల కోసం.. రూ. 584.70 కోట్లు
మౌలిక వసతులకు.. రూ. 22.04 కోట్లు

జగనన్న దయతోనే సొంతిల్లు



భీమవరం మెంటేవారితోటకు చెందిన మేడిశెట్టి దుర్గ భర్త సంచులు కుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. దుర్గ కూలీ పనులకు వెళుతున్నారు. వారికి ఇద్దరు పిల్లలు కాగా సొంత ఇల్లు లేదు. దీంతో 20 ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. అరకొర సంపాదనతో కుటుంబ జీవనం ఇబ్బందిగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత దుర్గకు విస్సాకోడేరు జగనన్న లేవుట్‌లో సెంటు స్థలంతో పాటు ఇల్లు మంజూరయ్యింది. ప్రభుత్వ సాయం రూ.1.80 లక్షలకు, కొంత సొంత నగదుతో గృహ నిర్మాణం పూర్తిచేసుకున్నారు. అద్దె బాధలు తప్పాయని, ఇక్కడ సెంటు స్థలం రూ.4 లక్షలు ఉంటుందని, జగనన్న దయతోనే తమ కల నెరవేరిందని ఈ దంపతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ సాయంతో నిర్మాణం



భీమవరం హౌసింగ్ బోర్డు కాలనీకు చెందిన గూడాల పావని గృహిణి. ఆమె భర్త డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు కాగా సొంత స్థలం కూడా లేదు. లక్షలు పెట్టి స్థలం కొనుగోలు చేసి ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. దీంతో ఎనిమిదేళ్లుగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నారు. పావని తల్లితండ్రులకు కూడా సొంతిల్లు లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత పావనితో పాటు ఆమె తల్లి భాగ్యలక్ష్మికి భీమవరం విస్సాకోడేరు లేఅవుట్‌లో స్థలం మంజూరైంది. ప్రభుత్వ సాయంతో వీరు ఇంటి నిర్మాణాలు పూర్తిచేసుకున్నారు. తమ సొంతింటి కల జగనన్న నెరవేర్చారని, ఈ లేఅవుట్‌లో సెంటు స్థలం రూ.4 లక్షల వరకు ఉంటుందని పావని ఆనందంగా చెబుతున్నారు.

ఇంటి విలువ రూ.లక్షల్లో..



నా భర్త ప్రైవేట్ ఉద్యోగి. మాకు ఇద్దరు పిల్లలు. సొంతిల్లు లేక 18 ఏళ్లుగా అద్దె ఇంట్లో జీవనం సాగిస్తున్నాం. కుటుంబ పోషణ, అద్దెకు ఇబ్బంది పడేవాళ్లం. జగనన్న మా తలరాతలు మార్చారు. మాకు ఇంటి స్థలంతోపాటు ఇల్లు కూడా మంజూరు చేయడంతో ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు మా ఇంటి విలువ లక్షల్లో ఉంటుంది. మాలాంటి వేలాది మంది పేదలకు లక్షల విలువ చేసే సొంతింటి కలను సీఎం జగన్ సాకారం చేశారు.

–కొమారపు శాంతిలక్ష్మి, తేతలి, తణుకు మండలం

చిల్లిగవ్వ లేని స్థితి నుంచి..



మాకు సొంత స్థలం కూడా లేకపోవడంతో 15 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉన్నాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత మాకు స్థలంతో పాటు ఇల్లు కూడా మంజూరు చేశారు. అలాగే నిర్మాణానికి సాయం అందించారు. దీంతో మేం ఇల్లు కట్టుకుని ఆనందంగా జీవిస్తున్నాం. చిల్లిగవ్వ ఆస్తి లేని మాకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలోని ఇల్లు ఇప్పుడు లక్షల్లో విలువ చేస్తుంది. సొంతింటి కల నెరవేరడం సంతోషంగా ఉంది.

– చేవూరి నాగ వెంకటలక్ష్మి, కె.బేతపూడి, నరసాపురం మండలం

12న అభివృద్ధి కమిటీ సమావేశం

ఏలూరు(మెట్రో): జిల్లా డెవలప్‌మెంట్ కో–ఆర్డినేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అధ్యక్షతన ఈనెల 12న సాయంత్రం 4 గంటలకు కలెక్టరేట్‌లో నిర్వహిస్తామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రకటనలో తెలిపారు. 2024కి కార్యాచరణ ప్రణాళిక, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్యలు, కేంద్ర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షిస్తామన్నారు.

నూతన ఆవిష్కరణలు రావాలి

తాడేపల్లిగూడెం: మారుతున్న సాంకేతిక విషయాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని ఐఐటీ పాట్నాలోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ జగన్నాథ్ మాలిక్ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో ఇన్నోవేషన్ కౌన్సిల్, ఈసీఈ, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో చాలెంజెస్ అండ్ ఇన్నోవేషన్ ఇన్ యాంటీనాస్ ఫర్ వైర్‌లెస్ కనెక్టివిటీ అనే అంశంపై అవగాహనా కార్యక్రమాన్ని వర్చువల్‌గా నిర్వహించారు. ఈ విషయంలో జరుగుతున్న విస్తృత పరిశోధనలు, వాటి ప్రాధాన్యం, ఆయా సాంకేతిక వ్యవస్థలో ఎదురవుతున్న సవాళ్లు, వాటి పరిష్కారాల గురించి విద్యార్థులకు వివరించారు. పరిశోధనల వైపు విద్యార్థులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. దేశాభివృద్ధికి దోహదపడే పరిశోధనలు నూతన ఆవిష్కరణలకు మార్గం సుగమం చేస్తాయన్నారు. కార్యక్రమానికి కన్వీనర్‌గా జీఆర్‌కే శాస్త్రి, కో–ఆర్డినేటర్‌గా యువరాజు వ్యవహరించారు. ఆచార్యులు పాల్గొన్నారు.



జాతీయ రహదారులపై సమీక్ష

ఏలూరు(మెట్రో): జాతీయ రహదారుల పెండింగ్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి గురువారం విజయ వాడ నుంచి కలెక్టర్లతో సమీక్షించారు. ఏలూరు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి హాజరయ్యారు. జాతీయ రహదారుల పెండింగ్ అంశాలతో పాటు పలు అంశాలపై జవహర్‌రెడ్డి సమీక్షించారు.

ఆసరా.. ఆనందం పంచేలా..

రాష్ట్రంలో మహిళాభ్యున్నతి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలుచేస్తున్నారు. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీని వైఎస్సార్ ఆసరా సాయంగా అందిస్తున్నారు. జిల్లాలో నాలుగో విడత ఆసరా సంబరాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. గురువారం ఆచంట, ఉండి, పాలకొల్లు నియోజకవర్గాల్లో ఆసరా కార్యక్రమాలు నిర్వహించారు.

– పెనుగొండ/పాలకొల్లు అర్బన్/ఆకివీడు



తూర్పుపాలెంలో ఆసరా సభకు హాజరైన మహిళలు



ఆకివీడులో ఆసరా సభకు హాజరైన లబ్ధిదారులు

హామీ మేరకు..



2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నాలుగు విడతల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డ్వాక్రా రుణాలను మాఫీ చేశారు. గత ప్రభుత్వాలు మహిళా సాధికారతను విస్మరించాయి. సీఎం జగన్‌తో అన్ని రంగాల్లోనూ మహిళా సాధికారత సాధ్యమైంది. ఎందరో మహిళలకు సర్పంచ్, నామినేటెడ్ పదవులు వరించాయి.

– గుడాల శిరీష, జగన్నాథపురం సర్పంచ్

ఎన్నడూ లేనంత సంక్షేమం



గతంలో ఎన్నడూ లేనంత సంక్షేమాన్ని సీఎం జగన్ మహిళలకు అందించారు. లంక భూముల్లో పేదలందరికీ పట్టాలు మంజూరు చేశారు. గతంలో ఇదే పట్టాల కోసం కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగాం. సీఎం జగన్, ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు దయతో నేరుగా ఇంటికే పట్టాలు అందాయి.

– కె.అనంతలక్ష్మి, పెనుగొండ

మహిళలకు ఆర్థిక భరోసా

ద్వాక్రా రుణమాఫీ చేసి వైఎస్సార్ ఆసరా పథకంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. అన్నింటా అండగా నిలుస్తున్నారు.

– చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట ఎమ్మెల్యే

(తూర్పుపాలెంలో గురువారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



తూర్పుపాలెంలో మహిళలకు చెక్కు అందిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

మహిళలదే పైచేయి

రాష్ట్రంలో మహిళలే పైచేయిగా ఉండేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి పేరునే పలు పథకాలు అమలు చేస్తున్నారు. మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు.

– పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

(ఆకివీడులో గురువారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



ఆకివీడులో మహిళలకు చెక్కు అందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల

మనసారా ఆశీర్వదించాలి

రాష్ట్రంలో అక్కచెల్లెమ్మలకు ఆసరాగా నిలిచి చేయూత అందించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని అందరూ మనసారా ఆశీర్వదించాలి. పూర్తిస్థాయిలో మద్దతుగా నిలవాలి

– గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి), వైఎస్సార్ సీపీ పాలకొల్లు ఇన్‌చార్జి

(పాలకొల్లులో గురువారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



పాలకొల్లులో ఆసరా సంబరాల్లో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)


సంక్షేమ శకం

“ జగన్ ప్రభుత్వంలో సంతోషంగా ఉన్నాం



నేను కూలి పనులు చేసుకుని జీవిస్తాను. జగనన్న పాలనలో పథకాల వల్ల మా కుటుంబానికి చాలా లబ్ధి కలిగింది. నాకు స్థలం ఇచ్చి ఇల్లు కట్టించి ఇచ్చి సొంతింటి కల నెరవేర్చారు. ఆసరా పథకంలో మాగ్రూపునకు రూ.4.50 లక్షల రుణమాఫీ అయ్యింది. నాకు వికలాంగుల పింఛను కింద ప్రతి నెలా రూ.3 వేలు అందుతోంది. ఆటో నడిపే మా అబ్బాయికి వాహనమిత్ర పథకం ద్వారా రూ.10 వేలు సాయం అందింది. ఈ సంవత్సరంతో నాకు 45 సంవత్సరాలు నిండాయి. చేయూత పథకం ద్వారా కూడా సాయం అందుతుందని ఆశిస్తున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంతోషంగా ఉన్నాం.

– పాతిన లక్ష్మీనరస, కొత్త ఉంగుటూరు, ఉంగుటూరు మండలం



నవరత్నాలతో మా ఇంట వెలుగులు



మాది చేనేత కార్మిక కుటుంబం. చేనేత వస్త్రాలకు ఆదరణ లేక మమ్మల్ని ఆదుకునేవారు లేక బతుకు దుర్భరంగా మారింది. జగనన్న ప్రభుత్వం రాకతో కార్మిక పింఛన్ రూ.3 వేలు మంజూరైంది. నా భార్యకు ఆసరా రుణ మాఫీతో రూ.45 వేలు అప్పు తీరింది. చేయూత పథకం ద్వారా రూ.18 వేలు, మా మనవళ్లకు అమ్మ ఒడి పథకం ద్వారా సాయం అందుతోంది. దీంతో నా కుటుంబానికి మనోధైర్యం వచ్చింది. మా బోటి పేద కుటుంబాలకు జగనన్నే అండా దండా. ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పేదల బతుకుల్లో వెలుగులు నింపుతున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చల్లగా ఉండాలి. జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రి కావాలి.

– కూనం సత్యనారాయణ, చెక్కపల్లి, ముసునూరు మండలం

జీవితాంతం రుణపడి ఉంటాం



మాది సామాన్య పేద కుటుంబం. ఆగిరిపల్లిలో నా భర్త శీలం నాగరాజుతో కలిసి చిన్న హోటల్ నడుపుకుంటున్నాం. మాకు ఇద్దరు పిల్లలు. అరకొర సంపాదనతో ఇల్లు, హోటల్ అద్దె చెల్లిస్తూ మరో వైపు పిల్లలను చదివించుకుంటూ అనేక ఇబ్బందులు పడుతున్నాం. గత టీడీపీ ప్రభుత్వంలో కాళ్లు అరిగేలా తిరిగినా ఇంటి స్థలం ఇవ్వలేదు. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక వలంటీర్ సాయంతో దరఖాస్తు చేసిన కొద్దిరోజుల్లోనే స్థలం ఇవ్వడమే కాక ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఇచ్చారు. నా భర్తకు రోడ్డు ప్రమాదంలో కాలు విరగగా, ఆరోగ్యశ్రీ ద్వారా రూ.1.50 లక్షల విలువైన ఆపరేషన్ చేశారు. మా అమ్మాయికి అమ్మ ఒడి ద్వారా ఏటా రూ.15 వేలు అందుతోంది.. వైఎస్సార్ ఆసరాలో రూ.72 వేలు రుణమాఫీ లబ్ధి చేకూరింది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

– శీలం జ్యోత్స్న, ఆగిరిపల్లి ”

క్లుప్తంగా

శ్రీవారి దేవస్థానం నూతన డీఈఓగా బాబురావు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డీఈఓ బాబురావు

ద్వారకాతిరుమల: శ్రీవారి దేవస్థానం నూతన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పి.బాబురావు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు కాకినాడలోని ఎంఎస్ఎన్ చారిటీస్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేసిన ఆయన పదోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. తొలుత ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఆ తర్వాత ఉద్యోగ బాధ్యతలను చేపట్టారు.

రొయ్యల చెరువులో విష ప్రయోగం

భీమవరం అర్బన్: అన్నదమ్ముల మధ్య తగాదా నేపథ్యంలో గురువారం రొయ్యల చెరువులో విషప్రయోగంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. నాగిడిపాలెం గ్రామానికి చెందిన నాగిడి రాధాకృష్ణకు బరువానిపేటలో 70 సెంట్ల చెరువులో రొయ్యల పెంపకం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో తన అన్నయ్య నాగిడి సత్యనారాయణ చెరువులో విష ప్రయోగం చేయడంతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని తమ్ముడు నాగిడి రాధాకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు హెచ్‌సీ పి.మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమష్టిగా నులిమేద్దాం

- నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం
- నేడు, ఈ నెల 16న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- పశ్చిమగోదావరి జిల్లాలో 3.25 లక్షల మంది లక్ష్యం

నులి పురుగుల వల్ల పిల్లల్లో అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. ముఖ్యంగా రక్తహీనత, పోషకాహారలోపం బారిన పడతారు. ఆకలి మందగించడం, బలహీనత, ఆందోళన, కడుపు నొప్పి, వికారం, అతిసారం, మలంలో రక్తం వంటి లక్షణాలు కనిపించడమే కాక వ్యాధి నిరోధక శక్తి తగ్గి శారీరక ఎదుగుదలపై కూడా ప్రభావం చూపుతుంది. శుక్రవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఏడాదిలో ఆరు నెలల వ్యవధిలో రెండు సార్లు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.

భీమవరం (ప్రకాశం చౌక్): చిన్నారుల్లో నులి పురుగులను మల పరీక్ష ద్వారా గుర్తించవచ్చు. నులి పురుగుల లార్వాలో 20 లోపు ఉంటే సాధారణంగా, వాటి సంఖ్య 20 నుంచి 40 వరకు ఉంటే మధ్యస్తం, 40కి పైగా ఉంటే తీవ్రంగా ఉంటే తీవ్రంగా గుర్తించాలి. అయితే ముందు జాగ్రత్తతో వీటిని నివారించవచ్చని వైద్యులు చెబుతున్నారు. దీని నివారణకు పరిశుభ్రతను మించిన మందు లేదని స్పష్టం చేస్తున్నారు. నులి పురుగుల వల్ల పిల్లల్లో శారీరక ఎదుగుదల ఆగిపోతున్నది.

దీనితో పిల్లలు బక్కచిక్కినట్లు కనిపిస్తారు. కడుపులో నొప్పి వస్తుంది. నులి పురుగులను నివారిస్తే సంపూర్ణ ఆరోగ్యవంతులు అవుతారు. అంతేకాకుండా రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది.





ఆల్బెండజోల్ మాత్రలు

19 ఏళ్ల వయస్సు లోపు పిల్లలకు..

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ చేసేందుకు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఏడాది, ఒక ఏడాది వయస్సు నుంచి 19 ఏళ్ల వయస్సు ఉన్న పిల్లలకు, యువతకు ఈ నివారణ మాత్రల (అల్బండజోల్)ను వేయనున్నారు. శుక్రవారం నిర్వహించే ఈ కార్యక్రమంలో మాత్రలు తీసుకోనివారికి 16వ తేదీన మాత్రలను అందిస్తారు. అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లోని విద్యార్థులకు వీటిని వేసేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది సిద్ధమయ్యారు.

జిల్లాలో 3,25,285 మందికి పంపిణీ లక్ష్యం

పశ్చిమగోదావరి జిల్లాలో 3,25,285 మంది 19 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని వైద్య ఆరోగ్యశాఖ లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇప్పటికే మాత్రలు ఆయా అంగన్‌వాడీ సెంటర్లు, పీహెచ్‌సీలకు చేరాయి. అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొననున్నారు. స్కూల్, కళాశాలల్లో లేని బయట వారు కూడా గ్రామంలోని స్కూల్, అంగన్‌వాడి కేంద్రాలకు వెళ్లి అల్బెండజోల్ మాత్రలను తీసుకోవచ్చు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఇవే

- గోళ్లను శుభ్రంగా కత్తిరించుకోవాలి
- ఆహారంపై ఈగలు, దోమలు వాలకుండా జాగ్రత్త వహించాలి
- బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయకూడదు
- భోజనానికి ముందు, తర్వాత చేతులు శుభ్రం చేసుకోవాలి
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పిల్లలు బయటకు వెళ్లేటప్పుడు చెప్పులు ధరించేలా చూడాలి

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



నులి పురుగుల నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న అల్బెండజోల్ మాత్రలను పిల్లలకు వేసేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. జిల్లాలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం మాత్రలు పంపిణీ చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల వయస్సు గలిగిన 3.25 లక్షల మందికి మాత్రలు పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. శుక్రవారం అందుబాటులో లేని వారు 16వ తేదీన పంపిణీ చేసే మాత్రలను తప్పనిసరిగా వేసుకోవాలి.

– డి.మహేశ్వరరావు జిల్లా వైద్యా ఆరోగ్యశాఖ అధికారి

ఆవు యజమానికి పరిహారం అందజేత



కొవ్వాడయ్యకు పరిహారం అందజేస్తున్న డీఎఫ్‌ఓ

కొయ్యలగూడెం/బుట్టాయగూడెం: పులి దాడిలో ఆవు మృతి చెందడంతో పశువు యజమాని కొవ్వాడయ్యకు రూ.30 వేల పరిహారాన్ని గురువారం అందజేసినట్లు కన్నాపురం అటవీశాఖ రేంజర్ కృష్ణకుమారి చెప్పారు. బుట్టాయిగూడెం మండలం రాజానగరం పంచాయతీ కొవ్వాడ గ్రామంలో పెద్దపులి దాడిలో కుంజా కొవ్వాడయ్యకు చెందిన ఆవు మృతి చెందిన ఘటన తెలిసిందే. ఏలూరు అటవీశాఖ కార్యాలయంలో జిల్లా అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) రవీంద్ర ధామ్ చేతుల మీదుగా నగదును అందజేశారు. పులి సంచారంపై ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని, పాపికొండల అభయారణ్యంలోకి పులి వెళ్లిపోయిందని అటవీశాఖ రేంజర్ కృష్ణ కుమారి తెలిపారు.

మావుళ్లమ్మ ఆలయ ఈఓ భద్రాజీకి పదోన్నతి

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ దేవస్థానం సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న యర్రంశెట్టి భద్రాజీకి డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతిపై లభించింది. అనంతపురం జిల్లా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానానికి డీసీగా నియమితులయ్యారు. గురువారం ఆయన అక్కడ బాధ్యతలు చేపట్టనున్నారు. మావుళ్లమ్మ దేవస్థానం ఈవోగా ఇంకా ఎవరినీ నియమించలేదు. కొంత మంది ఈఓలకు ఏసీలుగా పదోన్నతి ఇచ్చే అవకాశం ఉందని, అందులో ఒకరిని ఇక్కడ నియమిస్తారంటున్నారు. శుక్రవారం ఈఓ నియామకంపై నిర్ణయం కొలిక్కివచ్చే అవకాశం ఉంది.

తూర్పుపాలెంలో చోరీ

పోడూరు: తూర్పుపాలెం గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామంలో వేమవరపు నాగమణి తన ఇద్దరు కొడుకులతో అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. కొద్దిరోజులుగా చుట్టుపక్కల మహిళలతో కలిసి వంటలకు కూరగాయలు కోసే పనికి వెళుతోంది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో రాత్రి ఇంటికి తాళం వేసి ఆమె పనికి వెళ్లేది. గురువారం ఉదయం ఆమె ఇంటికి వచ్చి చూసేసరికి బీరువా పగులగొట్టి ఉండటాన్ని గమనించింది. ఇంటి పనుల నిమిత్తం అందులో దాచిన రూ.75 వేలు నగదు, అర కాసు బంగారం కనిపించకపోడంతో చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.రామ్‌కుమార్ తెలిపారు.

23 టన్నుల పీడీఎస్ రైస్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: లారీలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ రైస్‌ను లక్కవరం పోలీసులు పట్టివేశారు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం కరీంగనర్ జిల్లా చొప్పగండి నుంచి కాకినాడకు పోర్టుకు అక్రమంగా పీడీఎస్ రైస్ తరలిస్తున్నారనే సమాచారంతో ఎస్సై సుధీర్ తన సిబ్బందితో నిఘా పెట్టి 23 టన్నుల పీడీఎస్ బియ్యంతో వెళుతున్న లారీని పట్టుకుని లక్కవరం స్టేషన్‌కి తరలించారు. సివిల్ సప్‌లై అధికారులకు సమాచారం అందించి బియ్యం లోడు లారీని అప్పగించారు. సివిల్ సప్లయిస్ డీటీ లక్ష్మీకుమారి మాట్లాడుతూ పట్టుకున్న బియ్యం విలువ రూ.4.14 లక్షలు, లారీ విలువ రూ.7 లక్షలు మొత్తం రూ.11.14 లక్షలు ఉంటుందన్నారు. లారీ యజమాని అయితం కృష్ణ, డ్రైవర్ అంకూరి రామస్వామిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు మావుళ్లమ్మ ప్రసాద వితరణ

- అమ్మవారి 60వ వార్షికోత్సవాల్లో భారీగా అన్నదానం
- ఉదయం 8 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు
- 70 వేల నుంచి 90 వేల మందికి భోజన ఏర్పాట్లు



వంటలు సిద్ధం చేస్తున్న మహిళలు

భీమవరం (ప్రకాశం చౌక్) : శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 60వ వార్షిక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన నిర్వహిస్తున్నారు. 70 నుంచి 90 వేల మంది భక్తులు అమ్మవారి అన్నదాన ప్రసాదం స్వీకరించడానికి తరలివస్తారని అంచనా. ఇందుకోసం ఇప్పటికే ఉత్సవ నిర్వాహకులు నిరుల్లి కూరగాయ పండ్లు, వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. గురువారం ఉదయమే వంటలకు అవసరమైన కూరగాయలు, బియ్యం, సరుకులు సిద్ధం చేశారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు అమ్మవారి ప్రసాదం స్వీకరించేలా ఏర్పాట్లు చేశారు.

ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ

ఆలయం వద్ద నిర్వహించే అఖండ అన్నసమారాధనకు భారీగా జనం తరలిరానున్న నేపథ్యంలో ఏర్పాట్లను గురువారం భీమవరం డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి పరిశీలించారు. క్యూలైన్లు, భక్తులు భోజనం చేసే ప్రాంతాలను, జనం లోపలికి, బయటకు వెళ్లే మార్గాలపై నిర్వాహకులు, పోలీసు సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమానికి బందోబస్తుగా ముగ్గురు సీఐలు, ఎనిమిది మంది ఎస్సైలు, 52 మంది కానిస్టేబుళ్లు, 25 మంది మహిళా కానిస్టేబుళ్లను నియమించామన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి

అమ్మవారికి మహానైవేద్యం

శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి శుక్రవారం ఉదయం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం పలు రకాల పిండి వంటలు, స్వీట్స్, వంటకాలతో కూడిన మహానైవేద్యాన్ని అమ్మవారికి సమర్పిస్తారు.

లాకర్‌లో బంగారం మాయం అసాధ్యం

దువ్వ సొసైటీ చైర్‌పర్సన్ కృష్ణంరాజు, సొసైటీ కార్యదర్శి రుద్ర కిరణ్ వెల్లడి

తణుకు టౌన్: తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) లాకర్‌లో రూ.40 లక్షల బంగారు ఆభరణాలు మాయం కావడంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపాలని కోరుతున్నామని సొసైటీ చైర్మన్ జంపన ఎస్ఆర్‌వీఎస్ కృష్ణంరాజు (జేకే రాజు), సొసైటీ కార్యదర్శి రుద్ర కిరణ్ చెప్పారు. గురువారం దువ్వ సొసైటీలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన యన్నమని ఉమామహేశ్వరి, ఆమె భర్త వీరవెంకట సత్యప్రసాద్ తమ సొసైటీలో సభ్యులు అని, అలాగే సొసైటీలో లాకర్‌ను కలిగి ఉన్నారన్నారు. తమ సొసైటీలో 2012లో లాకర్ సౌకర్యం ఏర్పాటు చేయగా, ఉమామహేశ్వరి 2018లో లాకర్ తీసుకున్నారన్నారు. ఈనెల 6వ తేదీన సొసైటీ లాకర్‌ను ఓపెన్ చేసిన ఆమె బంగారు ఆభరణాలు కనిపించడంలేదని సొసైటీ సిబ్బందికి చెప్పారన్నారు. వెంటనే స్పందించి లాకర్‌ను పరిశీలించామన్నారు. బాధితురాలిని కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. యజమానికి తెలియకుండా లాకర్‌లో వస్తువులు మాయం కావడం అసాధ్యం అని, మాస్టర్ కీ, యజమాని వద్ద ఉన్న కీ రెండూ ఒకేసారి ఆపరేట్ చేస్తేనే లాకర్ ఓపెన్ అవుతుందన్నారు. ఇక్కడ కూడా ఉమామహేశ్వరి కీ తోనే లాకర్ ఓపెన్ అయిందన్నారు. దీనిపై పూర్తి స్థాయిలో సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇదిలా ఉండగా, సొసైటీలోని లాకర్‌లోని బంగారు ఆభరణాలు మాయమైన ఘటన వెలుగులోకి రావడంతో ఈ సొసైటీ లాకర్ సదుపాయం కలిగిన సభ్యులు గురువారం సొసైటీ వద్ద గుమిగూడారు. సొసైటీలోని తమ లాకర్లను తెరిచి తాము అందులో దాచిన వస్తువులు ఉన్నాయో లేదో సరిచూసుకున్నారు. దువ్వ సొసైటీలో 2012లో మొత్తం 45 లాకర్లు ఏర్పాటు చేయగా, వాటిలో ఇప్పటివరకు 41 మంది సభ్యులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారు.



దువ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం

విచారణ చేసిన పోలీసులు, సహకార అధికారులు

తణుకు: దువ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం లాకర్‌లో భద్రపరచిన బంగారు ఆభరణాలు మాయమైన ఘటనపై సొసైటీలో జిల్లా సహకార అధికారులు, పోలీసులు గురువారం విచారణ చేపట్టారు. ఐదేళ్ల క్రితం లాకర్‌లో దాచిన రూ.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు కనిపించడంలేదంటూ అదే గ్రామానికి చెందిన యన్నమని ఉమామహేశ్వరి జిల్లా సహకార అధికారులు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి పొద్దుపోయే వరకు విచారణ చేశారు. 2012లో సొసైటీలో ఖాతా ప్రారంభించిన ఉమామహేశ్వరి రూ.8 వేలు డిపాజిట్ చెల్లించి 23వ నంబర్ లాకర్ తీసుకున్నారు. అప్పటి నుంచి 19 సార్లు ఆమె లాకర్ వినియోగించారు. తరువాత 2018 సెప్టెంబర్ 18న లాకర్‌లో 806 గ్రాముల బంగారు ఆభరణాలు భద్రపరిచారు. ఈ నెల 6న లాకర్ తెరచి చూడగా బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఆమె ఫిర్యాదు మేరకు తాడేపల్లిగూడెం డీఎస్పీ శరత్ రాజకుమార్, రూరల్ ఎస్సై ఎస్.చంద్రశేఖర్, తణుకు సబ్ డివిజినల్ సహకార అధికారి పి.వెంకటేశ్వరరావు గురువారం సొసైటీలో విచారణ చేశారు. అధికారులు లాకర్‌ను పరిశీలించారు. బాధితురాలు ఉమామహేశ్వరి సమక్షంలో పలు రికార్డులను పరిశీలించారు. గతంలో లాకర్లు నియోగించిన సమయంలో రికార్డుల్లో ఉమమహేశ్వరి చేసిన సంతకాలను పరిశీలించి సిబ్బంది నుంచి వివరాలు ఆరా తీశారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

భీమవరం: అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం వన్‌టౌన్ ఎస్సై ఎం.వెంకటేశ్వరరావు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. భీమవరంలోని చినరంగనిపాలెంకు చెందిన గుత్తుల ప్రమీలకు 2017లో దుర్గాప్రసాద్‌తో వివాహమైంది. పెళ్లి సమయంలో రూ.1.20 లక్షల సొమ్ము కట్నంగా ఇచ్చారు. ఇటీవల ఇంకా కట్నం తేవాలంటూ దుర్గాప్రసాద్, కుటుంబసభ్యులు వేధింపులకు గురిచేస్తుండటంతో బాధితురాలు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అత్తిలిలో..

అత్తిలి: అదనపు కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి రాంబాబు గురువారం చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. అత్తిలి మండలం వరిఘేడు గ్రామానికి చెందిన కస్నీడి రమ్యశ్రీతో అదే గ్రామానికి చెందిన కస్నీడి నవీన్‌కుమార్‌తో 2014లో వివాహం అయింది. వివాహ సమయంలో రూ.లక్షన్నర నగదు, కాసున్నర బంగారం, రూ.లక్ష విలువైన సారె, సామాన్లు ఇచ్చింది. మద్యానికి బానిసైన భర్త నవీన్‌కుమార్ వ్యాపారం చేసుకోవడానికి అదనంగా రూ.2 లక్షలు కట్నం తీసుకురమ్మని కొడుతుండేవాడని, వేధింపులు తట్టుకోలేక ఏడు నెలలుగా బాధితురాలు తల్లిదండ్రులు వద్ద ఉంటోంది. ఈనెల 7వ తేదీన భర్త నవీన్ అత్తింటికి వచ్చి భార్య, ఆమె తల్లిదండ్రులు, సోదరుడిని కొట్టాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాంబాబు తెలిపారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మకు విశేష పూజలు



ముత్యాలమ్మతల్లి అమ్మవారు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం ముత్యాలంభపురం గ్రామంలో వేంచేసియున్న ముత్యాలమ్మ తల్లి అమ్మవారిని భక్తులు దర్శించి తరించాలని అమ్మవారి దేవస్థానం చైర్మన్ మాకా బాలాజీ కోరారు. నూతన ఆలయం ప్రతిష్ట కాబడి 4 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఈ నెల 10వ తేదీ శనివారం రోజున ఆలయం 5వ వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, లలిత సహస్రనామాలు, కోలాట భజనలు ఉంటాయని వివరించారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



ఎరువులను తనిఖీ చేస్తున్న ఎంవీ రమేష్

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం, మోదుగుంట, నవాబుపాలెం, ఆరుగొలను గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో గురువారం తణుకు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎంవీ రమేష్ తనిఖీలు నిర్వహించారు. ఎరువులను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలని అలాగే స్టాకు వివరాలను, వాటి ధరల వివరాలను రైతులకు తెలిసేలా ప్రదర్శించాలని సూచించారు. భౌతిక విలువలతో సమానంగా ఉండాలని లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఓ ఫారం లేని ఎరువులను వాటి అమ్మకాలను నిలిపివేశారు. సుమారు 3,92,000 విలువగల ఎరువులను అమ్మకాల నిలిపివేసామని తెలిపారు. వెంటనే సరి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్, విస్తరణ అధికారి మాధవవర్మలు ఉన్నారు.

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



దివ్యాంగులకు సేవలు అందిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు తెలిపారు. దివ్యాంగులకు అండగా ఉంటూ వారి అవసరాలను తీర్చేందుకు లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్, లయన్స్‌క్లబ్ ఆఫ్ అభయంలు పనిచేస్తాయని క్లబ్ డైరెక్టర్ చిక్కాల భ్రమరాంబికా అన్నారు.స్థానిక భవిత సెంటర్‌లో గురువారం దివ్యాంగులకు, చిన్నారులకు బెడ్ షీట్స్, స్టేషనరీ, స్నాక్స్ పంపిణీ చేశారు. భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధాయులు బాలీశ్వరయ్య, కుందం వెంకటేశ్వరరావు, ఆంజనేయస్వామి, హెచ్ఎం జ్యోతి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

రక్తదానం సామాజిక బాధ్యత



తణుకులో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

తణుకు: రక్తదానం సామాజిక బాధ్యత అని పలువురు వక్తలు పేర్కొన్నారు. పట్టణానికి చెందిన డాక్టర్ ముళ్లపూడి హరిశ్చంద్రప్రసాద్ ఇండియన్ రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో గురువారం ఉచిత రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో స్థానిక ఎంసీఎస్ డిగ్రీ కళాశాలకు చెందిన పది మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, సొసైటీ చైర్మన్ మంతెన శివరామబద్రిరాజు రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంకు మేనేజర్ కారుమంచి యోహాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేయడం నేరం



దువ్వలో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తణుకు టౌన్: బాల్య వివాహాలు చేయడం నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకట లక్ష్మి తెలిపారు. గురువారం తణుకు రూరల్ మండలం దువ్వ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు నిర్వహించిన ఆడపిల్లలను రక్షిద్దాం, ఆడపిల్లలను చదివిద్దాం (బేటీ పడావో బేటీ బచావో) కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

పగలు ఉడుకు.. రాత్రి వణుకు

- జిల్లాలో భిన్న వాతావరణం
- పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలు



తణుకులో తెల్లవారుజామున మంచు దుప్పటి

తణుకు: పగలు ఎండ వేడిమి.. రాత్రి సమయాల్లో చలితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవు తుండగా, రాత్రి చలిగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. తెల్లవారు జామున దట్టమైన మంచు కురుస్తోంది. సాధారణంగా శివరాత్రి వస్తే శివశివా అంటూ చలిగాలులు వెళ్లిపోతాయని చెబుతుంటారు. అయితే గతంలో ఎప్పుడూ లేని విధంగా ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత అధికమవు తోంది. మరోవైపు గత కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో మంచు కురుస్తుండటంతో చలిగాలులు మరింత పెరుగుతున్నాయి. తెల్లవారుజామున మంచు వర్షం పడినట్లు కురుస్తోంది.

పగలు భానుడి భగభగలు...

గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు అధికమవుతున్నాయి. జిల్లాలో గరిష్టంగా 30 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. అయితే రాత్రి సమయాల్లో మాత్రం ఉష్ణోగ్రతలు అమాంతం పడిపోతున్నాయి. గురువారం తెల్లవారు జామున తణుకులో 20 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా మధ్యాహ్నం 30 డిగ్రీల పైబడి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రాత్రి సమయాల్లో చలిగాలుల తీవ్రత అధికమవుతోంది. తెల్లవారుజామున పొగమంచు కమ్ముకుంటోంది. వాతావరణంలో భిన్న మార్పుల కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం...

వారం రోజులుగా పగలు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరిగింది. రెండు నెలలుగా శీతాకాలం కావడంతో ఏసీలు, ఫ్యాన్ల వినియోగం తగ్గింది. అయితే గణనీయంగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండంతో ఏసీలు, ఫ్యాన్ల వాడకం పెరుగుతోంది. దీంతో విద్యుత్ వాడకం పెరుగుతోందని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఈ పరిస్థితుల్లో ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని వైద్యులు సూచిస్తున్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ

- ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంతప్‌కుమార్
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్

పెంటపాడు: సమస్యల పరిష్కారంపై అధికార్లు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంతప్ కుమార్ తెలిపారు. గురువారం ఎంపీపీ దాసరి హైమావతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖల వారీగా ప్రగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్ కుమార్ మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. సమావేశానికి వచ్చే అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలకు వివరించేలా కృషి చేయాలన్నారు. ఏఎంసీకి సంబంధించి రూ.5కోట్లతో పుంత రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. జట్లపాలెం, బీకొండేపాడు, ఉమామహేశ్వరం, రావిపాడు తదితర గ్రామాలకు పుంత రోడ్లు మంజూరయ్యాని అన్నారు. ఎంపీపీ దాసరి హైమావతి మాట్లాడుతూ అధికారులు గ్రామాల్లో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం దిశగా ప్రజాప్రతినిధులు సహకారం తీసుకోవాలన్నారు.

విద్యాశాఖలో ప్రక్షాళన అవసరం

మండలంలో అన్ని ప్రధాన పాఠశాలకు డిప్యూటేషన్‌పై వెళ్లిన ఉపాధ్యాయుల స్థానంలో ఇంకా ఉపాధ్యాయులను నియమించలేదని మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జట్లపాలెం గ్రామంలో ఎంపీయూపీ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై పంపారని, విద్యార్థులు సరిపడ ఉన్న ఉపాధ్యాయులు సరిపడగా లేకపోవడంతో ఉత్తీరత శాతం తగ్గుతుంద న్నారు. మండలంలో పలు గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొందన్నారు. ఇదివరకు ఎంఈఓ-1 శ్రీనివాస్‌కు వివరించిన పరిస్థితిలో మార్పు లేదన్నారు. అటువంటి అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాశాఖను నాడు-నేడు, అమ్మ ఒడి, గోరుముద్ద లాంటి పథకాలతో ఎంతో అభివృద్ధి చేస్తుంటే ఎంఈఓ నిర్లక్ష్యం వల్ల విద్యాశాఖ కుంటుపడే ప్రమాదముందన్నారు. ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ఎంఈఓ -2 ను తీవ్రంగా ప్రశ్నించారు. అలాగే ఆకుతీగపాడు, బీకొండేపాడు తదితర గ్రామాల్లో ఎస్సీ ఏరియాల్లో విద్యు త్ లైన్లు, స్తంబాల సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించాలని ఎఈ పెద్దిరాజు నిలదీశారు. అందకారంలో మగ్గిపోతున్న విద్యుత్ శాఖ పట్టించుకోవడం లేదన్నారు. దీంతో ఎఇ మాట్లాడుతూ పంచాయతీ తీర్మానాలు చేస్తే తప్పక చర్యలు తీసుకుంటామన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా సాగేందుకు సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలు సహకారం అందించాలన్నారు. రాజకీయ పార్టీలు కక్షలకు పోకుండా పరిస్థితులకు అనుకూలంగా నడుచుకోవాలన్నారు. జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. ఎస్సై మోహనరావు మాట్లాడుతూ చట్టాలను పరిరక్షించేలా ప్రజలు సహకరించాలన్నారు. చట్టాలను, న్యాయాన్ని గౌరవించి అభివృద్ధికి ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ టీవీ రామకృష్ణ, మండల వ్యవసాయాధికారి పార్థశారధి, హౌసింగ్ ఏఇ నీవన్, వైస్ ఎంపీపీలు కొణతాల వెంకటరావు, ముప్పిడి సరోజిని, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారులతో పాటు పశుసంవర్ధకశాఖ, ఎలక్ట్రికల్, ఎంపీటీసీ సభ్యులు, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు దుర్గభవాని, సుజాత, జీజీబీ విజయలక్ష్మి, మండల వెటర్నరీ అధికారి మహేష్, పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి మౌనిక పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



గురుకుల పాఠశాల విద్యార్థిని అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతిభ కనబరిచిన గురుకుల విద్యార్థులకు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అభినందనలు తెలిపారు. జనవరి 26వ తేదిన ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, పెదతాడేపల్లి విద్యార్థులు జాతీయస్థాయిలో ద్వితీయ బహుమతి సాధించారు. గురువారం పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంట పద్మశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. బ్యాండ్ టీంకి యూనీఫారం సమకూర్చినందుకు జెడ్పీ చైర్‌పర్సన్‌కు పాఠశాల విద్యార్థులు, ప్రిన్సిపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో గురుకుల విద్యార్థులు చూపిన ప్రతిభా విద్యార్థి లోకానికి ఆదర్శనీయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని బహుమతులు సాధించాలని విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ అధ్యక్షులు ఘంట ప్రసాద్ రావు, పాఠశాల ప్రిన్సిపాల్ బి.రాజారావు, బ్యాండ్ టీం విద్యార్థి దినేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ కత్తుల రవి పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడాలి



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న మానవత సంస్థ సభ్యులు

తణుకు టౌన్: విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని వీడి శ్రద్ధగా చదివితే మంచి మార్కులు సాధిస్తారని మానవత సంస్థ కెరీర్ గైడెన్స్ సెల్ స్టేట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కే రాధాపుష్పావతి చెప్పారు. గురువారం తణుకులోని ఏకేటీపీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కెరీర్ గైడెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాపుష్పావతి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల కోసం ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు సాధిస్తారని తెలిపారు. జిల్లా శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమానికి పాఠశాల ప్రదానోపాధ్యాయుడు టీ రామకృష్ణ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో పదో తరగతి విద్యార్థులకు జిల్లా కమిటీ తరపున ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో తణుకు మానవత అధ్యక్షుడు ఏ బాలాజీ, ఉపాధ్యక్షురాలు కఠారి శారదాదేవి, కోశాధికారి ఏ కాశీ విశ్వనాథం, పూర్వ అధ్యక్షుడు ఆలపాటి సుబ్బారావు, సభ్యులు గోపాలరావు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మిద్దాం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: మత్తు పదార్థాలు సేవించడం వల్ల యువత తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాల రహిత సమాజాన్ని నిర్మించేందుకు జమాతె ఇస్లామీ హింద్ ఆధ్వర్యాన ఈనెల 18వ తేదీ వరకు 'రండి.. మత్తు రహిత సమాజాన్ని నిర్మిద్దాం' అనే నినాదంతో రాష్ట్ర స్థాయి అవగాహన ఉద్యమాన్ని చేపట్టినట్లు ఉద్యమ పట్టణ కన్వీనర్ మొహమ్మద్ సిద్దీఖ్ తెలిపారు. గురువారం భీమవరంలో ఉద్యమం ప్రారంభం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో భాగంగా డోర్ టు డోర్ క్యాంపెయిన్, కరపత్రాలు, పోస్టర్లు, సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం, రౌండ్ టేబుల్ సమావేశాలు, బహిరంగ సభలు, వ్యాసరచన పోటీలు వంటివి నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేమని చెప్పారు. అనంతరం ఉద్యమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జమాతె ఇస్లామీ హింద్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ ఫర్హాన్, ఎంఎం పాషా, ఇంతియాజ్, జానీ, ఉమైర్, ఇర్ఫాన్, నవీద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యం

ఆకివీడు: శివారు ప్రాంత ప్రజలతో సహా అన్ని గ్రామాలకూ రక్షిత మంచినీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పైప్‌లైన్ విస్తరణ పనులు చేపడుతోందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. మండలంలోని పెద కాపవరం గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో చేపట్టనున్న పైప్‌లైన్ పనులకు గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో జల జీవన్ మిషన్ నిధులతో పైప్‌లైన్ విస్తరణ పనులు, ఫిల్టర్ బెడ్‌లు, సంప్‌లు, ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణం చేపట్టామని తెలిపారు. అన్ని గ్రామాల్లో వేసవి నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పీవీఎల్ చెప్పారు. మంచినీటి చెరువుల్లో నీటిని పూర్తిగా నింపుకోవాలన్నారు. జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు, ఎంపీపీ కఠారి జయలక్ష్మి, సర్పంచ్ ఊసల బేబీ స్నేతు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు అన్యెం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



తణుకులో అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న వినీత

తణుకు: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, బాలింతలు, గర్భిణులకు అందించే సేవల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు బూసి వినీత హెచ్చరించారు. తణుకు మండలం మండపాక, పైడిపర్రులోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో పరిశుభ్రత, కిశోర బాలలకు అందుతున్న పౌష్టికాహార నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా వినీత మాట్లాడుతూ పలు కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. ఆమె వెంట ఐసీడీఎస్ తణుకు ప్రాజెక్టు సీడీపీవో ప్రమోదిని, సూపర్ వైజర్ అరుణ కుమారి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ సురేష్‌బాబు

పెంటపాడు: మండలంలోని పలు పోలింగ్ స్టేషన్‌లను గురువారం పెంటపాడు తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్ఐ మోహనరావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సమస్యాత్మక గ్రామాల్లో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. పెంటపాడులోని 171 నుంచి 180 నెంబర్ కలిగిన పోలింగ్ స్టేషన్‌లను పరిశీలించి ఓటింగ్ శాతం, అక్కడి ఉన్న సౌకర్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయా స్టేషన్‌ల్లో ఓటర్ లిస్టులను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కనకదుర్గ, ఏఎస్‌వో భార్గవి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఇంగ్లీష్‌పై పట్టు సాధించాలి

భీమవరం: ఇంగ్లీష్ భాషపై పట్టు సాధిస్తే ప్రపంచ స్థాయిలో ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవచ్చునని అంతర్జాతీయ కార్పొరేట్ ట్రైనీ జార్జ్ జాన్ చెప్పారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం జరిగిన ఓరియంటేషన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలోని పలు దేశాలు ఇంగ్లీష్ భాషలో ప్రావీణ్యం కలిగి నిజాయితీతో పనిచేసే వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాయని తెలిపారు. కళాశాల ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ బీహెచ్‌వీఎస్ లక్ష్మి మాట్లాడుతూ గ్లోబల్‌గా వస్తున్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేందుకు ఓరియంటేషన్ క్లాసులు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు మెండు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

భీమవరం: క్రీడలు శరీరానికే కాక ఉపాధి అవకాశాలకు ఎంతగానో దోహదం చేస్తాయని భీమవరం డీఎన్నార్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గాదిరాజు సత్యనారాయణరాజు(బాబు) అన్నారు. డీఎన్నార్ లా కళాశాల 34వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం క్రీడా పోటీలను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు. క్రీడలతో ఆరోగ్యం చేకూరి ఉత్సాహంగా చదువుకుంటారని, అందువల్ల విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో లా కళాశాల ప్రిన్సిపాల్ కె.రఘురామ్, జాయింట్ సెక్రటరీ కొత్తపల్లి శివరామరాజు, కె.రామకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ నర్సింహరాజు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తాడేపల్లిగూడెం ఆర్టీసీ డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి వెల్లడించారు. ఆర్టీసీ అందిస్తున్న సర్వీసులపై, సిబ్బంది ప్రవర్తన, కార్గో సేవలు తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఫోన్ నెంబర్ 99592 25488కు ఫోన్ చేయాలని కోరారు.

సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలి



అత్తిలి: సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రాజేష్



పెంటపాడు: జట్లపాలెంలో ఎలుకల బోరియలను గుర్తిస్తున్న అధికారులు, వ్యవసాయ సలహమండలి అధ్యక్షుడు కట్టుబోయిన

అత్తిలి: జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపడుతున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలంలోని 20 రైతు భరోసా కేంద్రాల్లో 69 కిలోల ఎలుకల మందును నూకలతో కలిపి రైతులకు అందజేస్తామని తెలిపారు. ఈవిషపు ఎరను 10గ్రాముల చొప్పున గుర్తించిన ఎలుక బొరియలలో ఉంచాలన్నారు. రైతులందరూ ఒకేసారి సామూహికంగా ఎలుకల నిర్మూలన చేసినట్లయితే ఫలితం బాగుంటుందన్నారు. రైతులందరూ ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



తాడేపల్లిగూడెం రూరల్: కృష్ణాయపాలెంలో ఎలుక కన్నాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఎలుకల మందు పంపిణీ

పెంటపాడు : సామూహిక ఎలుకల నిర్మూలనలో భాగంగా శుక్రవారం చేపట్టబోయే ఎలుకల మందు పంపిణీని అన్ని ఇగ్రామాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పార్థశారది తెలిపారు. గురువారం ఎడిఏ పీ.మురళీకృష్ణతో కలిసి మండలంలోని పలు గ్రామాల్లో ఎలుక బోరియలను గుర్తించారు. మండలానికి 101 కేజీల బ్రోమోడయాలిన్ మందు సిద్ధంగా ఉందన్నారు. తొలుత చేల గట్లపై ఎలుకల బొరియలు గుర్తించడం, ముందు రోజున మట్టితో పూడ్చడం, తర్వాత రోజు వెలుగు చేయాలని రైతులకు సూచించారు. అందరూ సామూహికంగా ఒకేసారి చేస్తే ప్రయోజనం ఉంటుందని ఆయన అన్నారు. ప్రతి ఆర్బీకే కేంద్రాల్లో ఈ మందును ఉచితంగా పంపిణీ చేస్తున్నామన్నారు.

రైతులందరూ సామూహిక ఎలుకల నివారణలో పాల్గొనండి

తాడేపల్లిగూడెం రూరల్: రైతులందరూ సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో పాల్గొనాలని మండల వ్యవసాయ అధికారి ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. రూరల్ మండలంలో పలు గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన మాట్లాడుతూ కృష్ణయ్యపాలెం, పడాల, తాడేపల్లి గ్రామాల్లో పర్య టించి ఎలుక కన్నాలలో మట్టిని పరిశీలించామని, ఎలకలు ఉన్నట్లు చూడటం జరిగిందని చెప్పారు. ఈ నెల 9వ తేదీ శుక్రవారం నుంచి అన్ని గ్రామ పంచాయతీలు దగ్గర, రైతు భరోసా కేంద్రాల దగ్గర బ్రోమోడియాలిన్ మందును కలిపి రైతులకు అందిస్తారని తెలిపారు.సామూహికంగా ఎలుకల నివారణ చేపడితేనే వాటిని ఎక్కువ శాతం నిర్మూలించ గలుగుతామన్నారు.